**కథ**

# స్వామి భక్తి

**-పంతం సుజాత**

రాత్రవడానికి ఇంకా చాలా సమయం ఉన్నట్టు సూర్యుడు తాడిచెట్టు మీద కూర్చున్నాడు. నువ్వు దిగితే కాని నేను పైకి రాలేను. తొందరగా రా! అని చంద్రుడు కన్నెర్ర జేసినట్టు ఆకాశం ఎర్రగా ఉంది. కూలి పనులకి వెళ్లిన ఆడా, మగా అంతా ఇంటిదారి పట్టారు. పశువులు మేత నెమరేసుకుంటూ విదానంగా వదుస్తున్నాయి. ఏ పనీ చెయ్యలేని ముసలివాళ్లు ఇంటిపట్టునే ఉండి వీధుల్లో ఆడుకుంటున్న పిల్లల్ని కాపు కాస్తున్నారు. ఒకరిద్దరు ఆడవాళ్లు మట్టి అరుగుల మీద కూర్చుని పేలు చూసుకుంటున్నారు.

చూరు కింద కూర్చుని గుడిశెకి ఊతగా కట్టిన కర్రకి గోగినార బిగించి తాడు పేను తున్నాడు గవరయ్య. అరవైకి పైబడ్డ వయసు, చిన్నప్పటి నుంచి కష్టానికి అలవాటుపడ్డ జీవి. ఈ వయసులో కూలీ, నాలీ చెయ్యలేడు. అలాగని ఖాళీగానూ కూర్చోలేక అందుబాటులో ఉన్న చిన్న చిన్న పనులు చేస్తుంటాడు. వీధి చివర వరకూ ఓసారి దృష్టి సారించి, మళ్లీ తన పనిలో నిమగ్నమ య్యాడు. ' 'ఈడింకా రాలేదేంటి?" అనుకుంటూ. మళ్లీ చూసాడు. పొన్నుకర్ర భుజాన పెట్టుకుని వీధి మలుపు తిరిగాడు సన్నాసులు. వాడిని చూడగానే గవరయ్య ముఖం ఇంతయ్యింది.

గవరయ్యకి ఒక్కగానొక్క కొడుకు సన్నాసులు. పుట్టిన పిల్లలు పుట్టినట్టు పురిట్లోనే చచ్చిపోతుంటే, పిచ్చయ్య, పెంటయ్య, సన్నాసులు లాంటి పేర్లతో పిలిస్తే పిల్లలు బతుకుతారని గవరయ్యకి ఎవరో సలహా ఇచ్చారు. అందుకే పుట్టగానే సన్నాసులు అని పేరు పెట్టాడు. ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ వాడు బ్రతికాడు. వాడి తర్వాత ఓ ఆడపిల్లని కని గవరయ్య భార్య కన్నుమూసింది.

సన్నాసులు చిన్నప్పటి నుంచి చాలా పొగరు చెలాయించేవాడు. పనిలేదు పాటలేదు. బలాదూర్ తిరగడం, ఎప్పుడైనా గవరయ్య కూడా దొరగారింటికి వెళ్లడం, ఊళ్లో ఎవ్వర్నీ లెఖ్ఖ చేసేవాడు కాదు. అందర్నీ ఎదిరించి మాట్లాడడం నేర్చుకున్నాడు. చీట్ల పేక, డబ్బు కోసం నోటికొచ్చిన అబద్దం చెప్పి అప్పు చెయ్యడం, ముఖ్యంగా తాగుడు...అది ఎంతగా అలవాటైయ్యిందంటే ఊరంతా 'తాగు బోతు సన్నాసి' అని పిలిచేలా స్థిరపడిపోయింది.

ఎంత బండగా, మొండిగా తిరిగినా ఒక్క దొరగారి పేరు వినేసరికి కాస్త జంకేవాడు.

నిలువెత్తు దొరగారి విగ్రహం చూస్తే కాళ్ళు వణికించని కుర్రకారు లేదు ఆ ఊళ్లో. అదీకాక కానిపని చేస్తే దొరగారికి వచ్చే కోపం వాడికి రెండుమూడు సార్లు అనుభవమైంది.

ఓసారి చేలగట్లమీద కందిచెట్లు పీకుతూ దొరగా రికి దొరికిపోయాడు. వయసు చిన్నదైనా దొరగారి చేతి దెబ్బలు బాగానే రుచి చూసాడు. అప్పుడు దొరగారిని ఏమీ చెయ్యలేక వాడిని పట్టిచ్చిన పెద్ద పాలేరు మీద మాత్రం పగ తీర్చుకున్నాడు. వాడి మనస్తత్వమే అంత. తప్పు చేసినా అందరూ ఒప్పుకుని తీరాలి.

రెండోసారి చీట్ల పేకాడుతూ దొరికిపోయాడు సన్నాసులు. మిగతా కుర్రాళ్లంతా ఆయన్ని చూసి పారిపోతే వాడు మాత్రం ధైర్యంగా అక్కడే కూర్చు న్నాడు. అప్పుడంటే కందిచెట్లు ఆయన సొంతం కాబట్టి కొట్టారు. ఇప్పుడు ఈ ఆట నా ఇష్టం. ఇదీ వాడి ధీమా. అయితే ఊళ్లో ఏ పిల్లలు తప్పు చేసినా ఉపేక్షించే రకం కాదు దొరగారు. అప్పుడు సన్నాసులు వీపుమీద బావే మర్యాద జరిగింది.

మూడోసారి దొరగారి చేల్లో కల్లు తాగుతూ దొరికాడు. అప్పుడే సన్నాసుల కాళ్లు, చేతులూ కట్టి గదిలో పడేసాడు గవరయ్య. ఈసారి కంటబడితే దొరగారు చంపేస్తారన్న భయంతో వారం రోజులు వాడిని బయటకు రానివ్వలేదు.

గవరయ్యకి వయసుడిగి పోయాక, దొరగారు పొలమెళ్లినప్పుడు ఆయనకి భోజనం పట్టుకెళ్లడానికి నియమించబడ్డాడు సన్నాసులు. నిజానికి వాడిని పనిలో పెట్టుకోవడానికి ముందు దొరగారు ఒప్పు కోలేదు. కాని గవరయ్య ప్రాధేయపడ్డాడు.

"ఆడిని సంపినా, కోసినా మీరే దార్లో పెట్టాలి. మీ దగ్గరైతే వాడు భయంగా పడుంటాడు దొరా!" అని దొరగారిని ఒప్పించాడు.

దుష్టుణ్ణి దండిస్తే రెచ్చిపోతాడని దొరగారికి బాగా తెలుసు. అందుకే వయసొచ్చాక సన్నా సుల్ని కొట్టడం మానేసారాయన. కాని ఆయన మాట వింటే వాడి కాళ్లు వణికేలా మాత్రం అదుపులో ఉంచుకొన్నారు. వాడికి ఉన్న పెద్ద బలహీనత తాగుడే. అప్పడప్పుడు తాడిచెట్లకి కట్టిన కల్లు ముంతలు మాయం చేసినా ఇప్పటి వరకూ దొరగారికి దొరక్కపోవడం వాడి గొప్పతనం. ఒకరి ద్దరు చూసినా సన్నాసుల సంగతి తెలుసు కాబట్టి దొరగారికి చెప్పే ధైర్యం చెయ్యలేకపోయారు.

* * *

మూడు రోజులుగా దొరగారు ఊళ్లో లేరు. ఎప్పు డొస్తారో తెలీదు. తాడి తోపంతా వాడి ఆధీనంలో ఉంచుకున్నాడు. ఎవరైనా చెయ్యేస్తే నరికేస్తానన్నట్టు స్వైర విహారం చేస్తున్నాడు సన్నాసులు. తల పైకెత్తి చూసాడు. చుర్రుమన్న ఎండ కంట్లో గుచ్చుకున్నా, నురగలు కక్కుతున్న కల్లుకుండ వాడి కంట్లో పడింది.

తలకి చుట్టుకున్న తువ్వాలు తీసి ముడివేసాడు. దాన్ని రెండు కాళ్ళకి బంధనం వేసి తాడిచెట్టు ఎక్కడం ప్రారంభించాడు. చివరికంటా ఎక్కే సాక అయసం తీర్చుకుంటూ కిందకి చూసాడు. దూరంగా శివయ్య పరిగెత్తుకొస్తున్నాడు. పేటలో కుర్రాడే వాడూను.

"ఒరేయ్ సన్నాసులు ఎక్కడున్నావు?" ఎలుగెత్తి అరుస్తూ వస్తున్నాడు శివయ్య. "ఏందిరా శివయ్యా ఏటయ్యింది? ఎందుకట్టా అరుత్తున్నావు" పాలికే కతో పైనించి అడిగాడు సన్నాసులు.

శివయ్య దిక్కులు చూడడం చూసి "ఇక్కడ, ఇక్కడ పైకి చూడెహె" అన్నాడు మళ్లీ.

శివయ్య పైకి చూళ్లేక కంటికి చేతులడ్డం పెట్టుని గట్టిగా అరిచి చెప్పాడు.

"నీ పెళ్లాం కడుపు నొప్పితో గిలగిల్లాడిపోతుంది. బేగి కిందకి దిగు, శివయ్య మాటలు వినబడక "ఎవరూ" అన్నట్టు చెవిదగ్గర చేతిని ఉంచాడు సన్నాసులు.

"రత్తాలు..." శివయ్య మాటలు పూర్తికాక ముందే సన్నాసులు చెట్టు దిగడం ప్రారంభించాడు. తాడిచెట్టు అంత తొందరగా దిగడాన్ని మొదటి సారిగా చూస్తున్నట్టు నోరెళ్ల బెట్టాడు శివయ్య. సగానికి పైగా చెట్టు దిగి అక్కడి నుండి కిందకి దూకేసాడు. వాడు లేవడం ఊళ్లోకి పరుగు



పెట్టడం ఒకేసారి జరిగింది. తెరిచిన నోరు అలాగే ఉంచుకుని వెనకాలే పరిగెత్తాడు శీనయ్య.

* * *

సన్నాసులు మేనమామ కూతురు రత్తాలు. నాలు గేళ్ల క్రితం దాన్ని ఎత్తుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. వాడు ఏం చేసినా అది ఓ చరిత్రే. రత్తాలు తండ్రి ఈ పెళ్లికి అస్సలు ఒప్పుకోలేదు.

ఆ తాగుబోతు ఎదవకి నా కూతుర్ని ఇవ్వ నని తెగేసి చెప్పాడు. చిన్నప్పటి నుంచీ అనుకున్న సంబంధం. వాడి ప్రాణాలన్నీ దాని మీదే పెట్టు కుని పెరిగాడు. మేనమామ మాట వినగానే వాడికి చిర్రెత్తుకొచ్చింది.

దొరగారి కమతంలో చేరాక పగటిపూట వాడె ప్పుడూ తాగలేదు. కాని ఆరోజు తాగాడు. పీకల్దాకా తాగి కత్తి తీసుకుని బయలుదేరాడు.

తను కూడా రత్తాల్ని పంపకపోతే మేనమామని చంపుతానన్నాడు. రాకపోతే రత్తాల్ని చంపేస్తాన న్నాడు. వాడెప్పుడూ అంతే కావాలనుకున్న దాన్ని బలవంతంగానైనా సొంతం చేసుకునే రకం. ఆ రోజే రత్తాలు మెళ్లో తాళికట్టి ఇంటికి తీసుకొ చ్చాడు. దాన్ని నెత్తిన పెట్టుకు చూసుకుంటాడు. దాని మాటంటే వేదం. కాని తాగుడు విషయంలో రత్తాలు కూడా ఏమీ చెయ్యలేకపోయింది వాడిని.

ఒక్కో సమస్యకి పరిష్కారం ఏ రూపంలో వస్తుందో ఎవరికీ తెలీదు.

* * *

సన్నాసులు వచ్చేసరికి రత్తాలు మంచం మీద గిల గిల్లాడి పోతోంది. దాన్ని చేతుల మీద వేసు కుని ఊళ్లో డాక్టర్ దగ్గరకి పరుగెత్తాడు. రత్తాల్ని పరీక్ష చేసిన డాక్టర్ అది 'అపెండిసైటీస్' అని వెంటనే ఆపరేషన్ చేయకపోతే ప్రమాదమని చెప్పాడు. నొప్పి తగ్గడానికి ఇంజక్షన్ చేసి, రెండు, మూడు వేల వరకూ ఖర్చవుతుందని, వెంటనే పట్నం తీసుకెళ్లమని చెప్పాడు.

రత్తాల్ని అక్కడే వదిలేసి ఇంటికి పరుగెత్తాడు సన్నాసులు. ఇల్లు ఇల్లంతా తిరగేసినా ఒక్క పైసా కూడా దొరకలేదు. శీనయ్య ద్వారా సంగతి విన్న గవరయ్య కొడుకుని తెగతిట్టాడు.

"ఏ రోజన్నా ఒక్క రూపాయి ఎనకేద్దాం అక్కర కొస్తాది అన్న ఆలోచనే లేదు. నీ పెళ్లాం కట్టపడిన సొమ్ము కూడా నీ సారాకే సాలదాయే. నిన్ను చేసుకున్నందుకు దాని ఖర్మ ఇట్టా కాలింది. దాని చావు దాన్ని చావనీ" అన్నాడు బాధగా.

ఇంకో సమయంలో అయితే అన్ని మాటలన్నందుకు తండ్రి అని చూడకుండా కత్తి తీసేవాడే. కాని ఇప్పుడు గిలగిల్లాడుతున్న రత్తాలే వాడి కళ్లముందు కదులుతోంది. సరిగ్గా సమయానికి దొరగారు ఊళ్లో లేకుండా పోయారు.

మిగతా మోతుబరి రైతులందరి ఇళ్లకి డబ్బు సహాయం చెయ్యమని అడగడానికి వెళ్లాడు. అప్పిగా ఇమ్మని ప్రాధేయపడ్డాడు. అందరూ 'ఛీ' కొట్టారు వాడిని.

"బాకీ ఎలా తీరుస్తావురా తాగుబోతు సచ్చినోడా!" అన్నారు ఒకరు.

"ఎన్నిసార్లు ఇలాంటి అబద్దాలు చెప్పి డబ్బు తీసుకెళ్లలేదు. నీ సంగతి మాకు బాగా తెలుసు" అన్నారు ఇంకొకరు.

"నా మాటకే ఎదురు చెప్పిన వాడికి నేనెందుకు సాయం చెయ్యాలి" అన్నారు ప్రెసిడెంటుగారు.

ఎవర్ని లెక్క చెయ్యకుండా తిరిగినవాడు ఈరోజు ఇలా పెళ్లాం కోసం పాకులాడుతూ కాళ్ల వేళ్లా పడతుంటే అందరికీ వినోదంగా ఉంది. ఈ ఛీత్కారాలేమి వాడి చెవిన పడడం లేదు. ఎక్కడైనా డబ్బు దొరికితే రెక్కలు కట్టుకుని రత్తాలు దగ్గర వాలాలని ఉంది. కనిపించిన వాళ్లందర్ని కత్తితో నరకాలన్నంత కసిగానూ ఉంది. ఏం చెయ్యాలో తెలీని స్థితిలో దాదాపు పిచ్చివాడిలా వీధిన పడ్డాడు సన్నాసులు. దారికి అడ్డుగా వచ్చిన వీధి కుక్కను డొక్కలో తన్నాడు. అది అంతెత్తున ఎగిరి కిందపడి 'కుయ్ కుయ్' మని అరుచుకుంటూ పోయింది. వెనకే నడుస్తున్న శీనుగాడు సన్నాసుల వైపు భయంగా చూసాడు.

అప్పుడు కనిపించింది వీధి మలుపులో దొరగారి కారు. సుడిగాలిలా వెళ్లి కారుకి అడ్డం పడిపోయాడు...

"దొరా నా రత్తాల్ని రచ్చించండి దొరా! అన్నాడు ఏడుస్తూ.

దొరగారు వింతగా చూస్తుంటే వెనకే వచ్చిన శీనయ్య విషయం చెప్పాడు. అంతా విన్న దొరగారు తాపీగా చుట్ట వెలిగించుకుంటూ సన్నాసుల వైపు చూసారు.

"ఊళ్లో అందరూ ఛీ కొట్టారంటే కొట్టరు మరి. అసలే తాగుబోతువి. నా బాకీ మాత్రం ఎలా తీరుస్తావు చెప్పు కారు దిగుతూ అన్నాడు.



**అక్షయ్ బట్టతల వ్యవహారం**

ఓనక్క అక్షయ్ కన్నా నటించిన 'ఆ లబ్ లాట్ వలే' సినిమా మీద అందరూ ఆశలు పెట్టుకుని ఉంటే తాను మాత్రం పోయి అమెరికాలో కూర్చున్నాడు. ఫోన్లకి కూడా దొరక్కుండా అక్షయ్ అమెరికాలో ఏం చేస్తున్నాడా? అని ఆరా తీస్తే ఇప్పుడిప్పుడే మొదలైన బట్టతల మీద వెంట్రుకలు మొలిపించుకునే కార్యక్రమంలో ఉన్నాడని తెలిసింది.

"దొరా!" నోరు తెరుచుకుని అవాక్కయిపోయాడు సన్నాసులు. సంగతి వినగానే దొరగారు జేబులోంచి డబ్బు తీసి ఇచ్చేస్తారనుకున్నాడు వాడు. ఆయనే ఆలా అనేసరికి నవనాడులూ కుంగిపోయి నోట మాట రాలేదు. దొరగారి కంఠం మళ్లీ ఖంగుమంది. ఆడను చూసి దెబ్బ కొట్టినట్టు అన్నారు.

"నిర్ణయించుకో రత్తాలు కావాలో, తాగుడు కావాలో. ఏదో ఒక్కటే. రత్తాలు కావాలనుకుంటే ఇంటికొచ్చి డబ్బు పట్టుకెళ్లు" చాలా స్పష్టంగా చెప్పారాయన.

ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు సన్నాసులు. తన తాగుడు వల్ల ఇప్పటికే ఎంత నష్టం జరిగిందో వాడికి బాగా అర్థమయ్యింది.

"రత్తాలే కావాలి దొరా!" అన్నాడు.

"అదే మాటమీద నిలబడు" దొరమాట శాసనం అయ్యింది. కారు దుమ్ము లేపుకుంటూ వెళ్లిపోయింది.

* * *

రత్తాలు ఆరోగ్యం కొంచెం కుదుట పడ్డాక సన్నాసులు తిరిగి పనిలోకి రావడం మొదలు పెట్టాడు. దొరగారికిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. దొరగారి కుడిభుజంలా మారిపోయాడు. నడక, మాట పూర్తిగా మారిపోయాయి. పొలం గట్ల మీద ముందు నడుస్తూ కర్రతో నేలని తాటించి పాముల్ని, పురుగుల్ని బెదిరించి దొరగారికి దారి సరిచెయ్యడం దగ్గర్నుంచి, రచ్చబండ దగ్గరకి ముందుగానే కబురు అందజెయ్యడం లాంటివి ఎవరూ చెప్పకుండానే అలవాటు చేసుకున్నాడు.

ఒక్కరోజు పనిలోకి రాకపోయినా కాళ్లాడనంతగా దొరగారికి అలవాటైపోయాడు.

సన్నాసులు చెల్లెలు గౌరికి పెళ్లి ఖాయమైంది. మగ పెళ్లివారు పదివేలు రొక్కం అడిగారు. అదీ పెళ్లికి ముందు ఇవ్వాలని షరతు పెట్టారు. దాంతో వాడికి మళ్లీ డబ్బు సమస్య వచ్చింది. దొరని అడగడానికి వాడికి ముఖం చెల్లలేదు. ఊళ్లో ఎలాంటి సహాయం లభించదని అనుభవం నేర్పింది. ఓ రోజు...

"ఛీ ఎదవ బతుకు. చెల్లి పెళ్లి చెయ్యలేని నాలాటి అన్న ఉంటే ఏం? సత్తే ఏం?" విరక్తిగా రత్తాలుతో అన్నాడు.

అప్పటి నుండి రత్తాలుకి భయం పట్టుకుంది. వాడి మాటంటే మాటే. ఏ ఎండ్రినన్నా తాగేస్తాడేమోనని హడలిపోయి, దొరగారింటికి వెళ్లి ఏడుస్తూ మొత్తం చెప్పేసింది. అంతా విని దొరగారు ఒక్కటే మాట అన్నారు.

"నేను ఇంకా బతికే ఉన్నాను. అనుకుంటే గౌరి పెళ్లికి ఏర్పాట్లు చేసుకోమను. లేదంటే వాడి ఇష్టం"

అదిగో అక్కడే పూర్తిగా దొరకి దాసోహమైపోయాడు సన్నాసులు. కర్రకి కదుతున్న ఆవుదూడని వదిలేసి గబుక్కున వచ్చాడు.

"అంతమాట అనొద్దు దొర. మీరు నూరేళ్లు చల్లగా ఉండాల. నూరేళ్లు చల్లగా..." కృతజ్ఞతతో గొంతు పూడుకుపోయింది. కళ్లు తుడుచుకుంటూ గోడవతల కెళ్లి నిలబడ్డాడు.

దొరగారు వాడివైపు కళ్లింతలు చేసుకుని చూసారు. ఏదీ ఆ తలబిరుసు? ఎక్కడ ఆ మొండితనపు పొగరు. ఏమైపోయింది ఆ అహంభావం. ఆ సన్నాసులేనా వీడసలు. ఇంత సహనం ఎలా వచ్చింది? పైకి కరుగ్గా ప్రవర్తించే వాడి మనసు ఇంత సున్నితంగా ఉందా! ఒక మంచివాడు చెడిపోవడానికి ఒక్కరోజు చాలు. కాని ఒక చెడ్డవాడు మారడానికి ఒక జీవితకాలం పడుతుంది అంటారు. ఇదేనేమో. అనుకున్నారు.

* * *

సంధ్య చీకట్లు అలుముకుంటున్నాయి. పేటలో ఆడాళ్లందరూ పనులు చేసుకుంటున్నారు. వీధి చివర నిలబడి "ఒరేయ్! సన్నాసులూ..."అని ఎలుగెత్తి పిలిచారు దొరగారు. ఆయన్ని చూడగానే ఆడాళ్లందరూ మర్యాదగా పక్కకి తప్పుకున్నారు.

నులకమంచం మీద పడుకుని ఉన్న సన్నాసులు ఆ కేక వినగానే తుళ్లిపడ్డాడు. మంచం దిగబోయి కంగారులో బోర్లా పడ్డాడు. దిగ్గున లేచి దండెం

మీద తువ్వాలు తీసుకుని బయటకు వస్తుంటే దూలం తగిలి నుదురు బొప్పి కట్టింది. అయినా లెక్కచెయ్యకుండా తలపాగ చుట్టుకుంటూనే పరిగెత్తి, చేతులు కట్టుకుంటూ "దొరా" అన్నాడు.

"ముందుగా నేను పొలం వెళ్తున్నాను. నువ్వు అన్నం తినేసి త్వరగా వచ్చేయ్. వరికుప్పలకి కాపలా పడుకోవాలి. నువ్వొచ్చాక నేను ఇంటికి వచ్చేస్తాను" అన్నారు దొరగారు.

"[illegible] రాత్రిల పొలం ఎళ్లొద్దు. నేను వచ్చేత్తాను" అన్నాడు సన్నాసులు.

ఏ పురుగో, పుట్టో దొర కాలికి అడ్డం పడుతుందని వాడి భయం. వాడి అంతర్యం గ్రహించినా గ్రహించనట్టే ప్రేమతో కూడిన కోపం ప్రదర్శించారు. "నోరు మూసుకుని చెప్పింది చెయ్యి. అన్నం తినేసి బేగ వచ్చేయ్" అని చెప్పి దొరగారు వెళ్లిపోయారు.

ఇంటికొచ్చి రత్తాల్ని నిలబడనివ్వలేదు. అన్నం ఉడికే వరకూ ఆగలేదు. మధ్యాహ్నం మిగిలిన అన్నంలో గంజిపోసుకుని గబగబా తినేసి వెళ్లిపోయాడు. వాడి ఆదరా బాదరా తిండి చూసి...

"దొరంటే పేణాలు వదిలేత్తాడు సన్నాసి" అంటూ మురిపెంగా నవ్వుకున్నాడు గవరయ్య.

దొరగారు పూర్తిగా పొలం గట్టు ఎక్కకుండానే సన్నాసులు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. దొరగారు గుంభనంగా నవ్వుకున్నారు. పూర్తిగా చీకటి పడిపోయింది. పౌర్ణమి రోజులు కావడంతో అప్పటికే వెన్నెల వచ్చేసింది. కట్టమీద తాడి చెట్ల మధ్య నుంచి చంద్రుడు పైకి పాకుతున్నాడు. అచ్చు కల్లుకుండ కోసం చెట్టెక్కే ఒకప్పటి సన్నాసుల్లా ఉన్నాడు.

చలిగాలి తిరిగింది. దొరగారు కండువా తీసి చెవులమీదగా తలకి చుట్టుకుని వరికుప్పల చుట్టూ ఓసారి తిరిగి పరీక్షించారు. అంతా బానే ఉన్నట్టు తలాడించి చూసారు. అది చూసి సన్నాసులు అన్నాడు.

"చలి గాలేత్తోంది. మీరు ఇంటికెల్లిపొండి దొర నేనున్నానుగా".

దొర నవ్వి తన భుజంమీద శాలువా తీసి వాడిమీద వేస్తూ తిరుగుముఖం పట్టారు. వెళ్తూ వెళ్తూ రెండు చుట్టలు వాడికిస్తూ హెచ్చరించారు.

"జాగ్రత్తరా సన్నాసులు. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా కుప్పకి నిప్పెట్టేస్తారు."

"అట్టాగే దొర. మీరెళ్లండి" అని ఆయన్ని ఊరి పొలిమేరదాకా దిగబెట్టి వచ్చాడు సన్నాసులు.

తిరిగి వస్తుంటే కట్టమీద తాటి చెట్లు మోరసాచి ఆహ్వానిస్తున్నట్టు ఉన్నాయి. తలెత్తి చూసాడు సన్నాసులు. కల్లుముంత పక్కనుండి చంద్రుడు తొంగి చూస్తున్నాడు. పెదాలు తడవుకున్నాడు. మరుక్షణం దొరకిచ్చిన మాట గుర్తొచ్చి తల అడ్డంగా ఊపాడు. అలవాటైన ప్రాణం ఒకటే పీకుతోంది. తాగితే మాత్రం ఎవరు చూత్తారేటి అనుకున్నాడు మళ్లీ. ఆకాశంలో చంద్రుడు, పైన కల్లుకుండ కొంటెగా పిలుస్తూనే ఉన్నాయి.

* * *

దొరగారి వరికుప్పలు తగలడిపోయాయి. ఊరు ఊరంతా ఆ వార్త గుప్పుమంది. ఎవరి నోటవిన్నా అదేమాట. ఫైరింజను వచ్చి మంటలార్పినా అక్కడక్కడా పొగ లేస్తూనే ఉంది. గుమిగూడిన జనం [illegible]

"కాపలా ఎవరు పడుకున్నారు." పొలెకంట్రావు సందేహం వెలిబుచ్చాడు.

"ఇంకెవ్వరూ ఆ సన్నాసులే" ఎవరో సమాధానం.

"తాగుబోతు సన్నాసి ఆడు కాపలా ఏంటి? తాగిన మైకంలో ఏ చుట్ట పీకో విసిరి పారేసాడో ఏమో" నిజం ఏమిటో ఎవరికి తెలీదు కాని ఊహలు ఎక్కువైయ్యాయి. సన్నాసులు నోరు విప్పలేదు.

ఆ మంటల్లో సన్నాసులు ఒళ్లు కాలింది. అయినా వాడినెవరూ పట్టించుకోవట్లేదు. రత్తాలు ఏడుస్తూ వాడి వంటికి 'నవనీతం' రాస్తోంది.

"దొరగార్ని చూడగానే "క్షమించండి దొరా! తప్పయిపోయింది. ఇంత ఘోరం జరుగుతుందని తెలిస్తే కక్కుర్తి పడకపోదును" అన్నాడు సన్నాసులు.



## సిమ్రాన్ సింగారాలు

హిందీలో ఎబిసిఎల్ వారి తేరే మేరే సప్నేలో వేశాక సరైన బేరాల్లేని సమయంలో దక్షిణాది వారు అవకాశాలిచ్చి తెలుగు తమిళ ప్రేక్షకులకి దగ్గర చేశారు. అయితే నటన కంటే, వొళ్ళు, ఎత్తు పల్లాలు చూపిస్తుందని పేరు తెచ్చుకున్న సిమ్రాన్ తెలుగు కంటే తమిళంలో ఇంకా బాగా హవా నడిపిస్తోందిప్పుడు. దానికి తోడు ప్రభుదేవా తమ్ముడు రాజు సుందరంతో కలిసి పులిహోర కలుపుతోందట.

దొర మాట్లాడలేదు. ఒకప్పుడైతే వాడిని చితక్కొట్టి వదిలేవారు. ఇంతలో గవరయ్య వచ్చి చేతులు జోడించి ప్రాధేయపడ్డాడు. "ఈ ఒక్క తప్పు కాయండి దొరా"

అప్పుడు నోరు విప్పారు దొరగారు.

"ఎన్ని చేసాన్రా వాడికి. ఆడొక వెధవని తెలిసి పన్లో పెట్టుకున్నాను. చెల్లెలి పెళ్లి చేసాము. పెళ్లానికి [illegible] తీర్చమని అడిగానా వాడిని. ఎంత నమ్మకం లేకపోతే వాడినక్కడ కాపలా పడుకోబెడతాను. ఈరోజు నాకిచ్చిన మాట పక్కనెట్టి, లక్ష రూపాయల పంట తగలబెట్టేస్తాడా." దొరగారు కోపంతో ఊగిపోసాగారు.

ఒంటినిండా బొబ్బలతో దొడ్లో పడుకున్న సన్నాసుల దగ్గరకి విసురుగా వచ్చాడు గవరయ్య. ఆ ఊపులోనే అడిగాడు.

"నిజం చెప్పరా సన్నాసి. ఏం జరిగిందో చెప్పు రత్తాలంటే నీకు పేనంతో సమానం. దానిమీద పెట్టిన ఒట్టు నువ్వు దాటవు. నిజం చెప్పు" అన్నాడు.

చాలాసేపు మాట్లాడలేదు సన్నాసులు. గవరయ్య మళ్లీ రెట్టించాక మెల్లగా నోరు విప్పాడు.

"నీకు గుర్తుందా! అయ్యా! పది రోజుల క్రితం పక్కూరి ఈరిగాడి కొడుకు మన దొరగారి చేలో గడ్డి కోస్తుంటే దొంగతనం చేసినందుకు దొర వాడిని కొట్టారు. ఆ ఈరిగాడే దొరమీద కచ్చగట్టాడయ్యా. ఆయన్ని ఏమీ చెయ్యలేక దొరగారి కుప్పలకి నిప్పెట్టాడు. ఈ ఇషయం దొరకి తెలిస్తే ఆ కోపంలో దొర ఆడిని సంపేత్తారని భయంవేసింది. ఆ ఈరిగాడు కూడా ఎంతకైనా తెగించే మనిసి. దొరకోపం నీకు తెలవందేముంది. తప్పుచేత్తే ఎవర్నీ వదలరు. ఈ గొడవల్లో దొరగారికి ఏమైనా అయితదేమోనని భయం వేసింది. నాకెలాగూ తాగుబోతన్న పేరుంది కదా! అందుకే ఆ తప్పు నా మీద ఏసుకున్నాను. నన్నైతే దొర నాలు దెబ్బలేసి వదిలేత్తారు. అంతేకదా! ఒకేళ సంపినా పర్లేదు. నన్నే కదా!" అన్నాడు. వాటి మాటల్లో ఏమీ లేదు. అంకిత భావం తప్ప. తాగుడుని ప్రేమించినంతగా రత్తాల్ని ప్రేమించాడు. ప్రాణాన్ని ప్రేమించినంతగా యజమానిని ప్రేమించాడు అంతే.

ఏదో పనిమీద అక్కడికి రాబోయిన దొరగారికి ఆ మాటలన్నీ వినబడ్డాయి. వాడి పెద్ద మనసు ముందు ఆయన చేసిన పనులు చాలా అల్పంగా తోచి, వాడిపట్ల మనసు ద్రవించిపోయింది. వాడి 'స్వామిభక్తి' కి ఆయన కళ్లు ఎంతగా చెమర్చాయంటే కొత్తగా ఊరికి వేసే నారుమడికి వేరే నీరక్కర్లేకపోయింది.